వల

డి. కామేశ్వరి

"ఏమేవ్!.....ఎక్కడ తగలబడ్డావు? లోపలికివస్తూనే కేకపెట్టారు రావుగారు. "ఏమేవ్!"

"ఎందుకండీ, ఆ కేకలు......అలా ఇల్లెగర గొడ్తున్నారు......అవతల పొయ్యి మండిపోతూంది."

"నీ పొయ్యి తగలడ!.....పొయ్యేమిటే...... నీకు కొంప తగలబడినా లెక్కలేదుగాని.... పొయ్యిమాత్రం తగలబడకూడదు!........" చిటపటలాడిపోయే. భర్తవంక కాస్త వింతగా చూసింది జానకమ్మ.

"ఏమయిందండీ!......ఏమిటయిందని యీ రాద్ధాంతం?...... బాగానేవుంది మీ వరస!"

"ఎందుకు బాగుండదు నా వరస.....నీ వరస బాగుంది కనకా, నా వరస బాగులేకపోవడానికి......"

"మీరు ఏమైనా చెపుతారా?......నన్ను పొమ్మన్నారా?.....అవతల బోలెడు పనుంది నాకు......"

"ఏది, నిర్మల ఏది?......"

"ఇందుకోసమేనా యీ గొడవంతా......ఎక్కడికో షికారుకో సినిమాకో వెళ్ళి వుంటుంది."

"ఎవడితో వెళ్ళింది?... ఎవడితో వెళ్ళిందే?" కోపంగా అడిగారు రావుగారు. తెల్లబోయిచూసింది జానకమ్మ.

"ఏమిటండీ!"

"నీ కసలు పిల్లలసంగతి ఏమైనా తెలుస్తూందా? ఎంతసేపూ వంటింట్లోపడి చావడమేగాని... పిల్లల సంగతి ఏమైనా తెలుస్తూందే నీ కసలు? మంచి చెడ్డా ఏమైనా చూస్తున్నావా?"

"ఏమిటయిందో చెప్పకుండా ఏమిటే గొడవా మీరూనూ!" చిరాకుపడింది జానకమ్మ.

"ఏమిటింకా చెప్పడం!......అది....నీ కూతురు అడ్డమైనవాడితో ఏ రోడ్డుమీద చూసినా, ఏ పార్కులో చూసినా.....ఏ సినిమాలో చూసినా కనిపిస్తూందని వూరందరికి తెలిసినా నీకు, నాకు తెలిసిందే?......ఎప్పుడు వెడుతూందో, ఎప్పుడు వస్తూందో, ఎక్కడికి వెళ్ళిందో...... ఏంచేస్తుందో నీవేమయినా చూస్తున్నావా?.....నేనంటే ఆఫీసులో ఏడ్చేవాడిని..... యింట్లోవుండే నీవైనాచూస్తున్నావా దాని సంగతి......అది అలా విచ్చలవిడిగా తిరుగుతున్నా చూస్తూ ఏం అడగకుండా కళ్ళు మూసుకుని వూరుకున్నావా?.....మూడు నెలలనించి జరుగుతున్న యీ భాగోతం యివాళ దాకా నాకు తెలియలేదు.... ఆ శంకరంగారు చెపుతూంటే ... నా వళ్ళు చచ్చిపోయింది.....పెళ్ళీడు కొచ్చినపిల్ల అలా రోడ్లమ్మట... ఏ దౌర్భాగ్యుడితోపడితే ఆ దౌర్భాగ్యుడితో తిరుగుతూంటే యింక దానికి పెళ్ళి ఎలా అవుతుందే!......"

"ఎందుకండీ అలా చిందులు త్రొక్కుతున్నారు. దౌర్భాగ్యులతో ఎందుకు తిరుగుతుంది!....... అడ్డమయిన వాళ్ళతో తిరగనిస్తానా..... నాకామాత్రం తెలియదనుకున్నారా?" నిబ్బరంగా చెప్తున్న జానకమ్మవంక తెల్లబోయిచూశారు రావుగారు.

"ఏమిటే!......అయితే నీకు తెలుసన్నమాట! అదిలా తిరుగుతున్నట్లు నీకు తెలిసే వూరుకున్నావన్నమాట! దానికి బుద్ధిలేకపోతే నీకూ బుద్ధిలేకపోయిందా?......అవ్వ! పెళ్ళీడు కొచ్చినపిల్ల అలా తిరుగుతూంటే చూస్తూ వూరుకోవడానికి నీ బుద్ధి గడ్డితిందే!" కోపం పట్టలేకపోయారు రావుగారు.

"నా బుద్ధి గడ్డితినలేదు......నిక్షేపంలా వుంది. కాబట్టే వూరుకున్నా!... మీ మాత్రం మంచీ చెడ్డా నాకు తెలియవనుకున్నారా?.....అడ్డమయిన వాళ్ళతో ఏం తిరగడంలేదు అది.,.....నిక్షేపంలాంటి కుర్రాడితో, నెలకి ఐదువందలు తెచ్చుకునే రాజాలాంటి అబ్బాయితో తిరుగుతూంది!"

"వాడెవడైతేనేం? ఎన్ని వందలు తెచ్చుకుంటే మనకేమిటే, పరాయి మగవాడితో యీడొచ్చిన పిల్లని తిరగనిస్తావా?......వాడేం నీ అల్లుడా?..... అలా విహారాలుచేస్తూంటే చూస్తూ సంతోషించడానికి.......!'

"ఆ.......అల్లుడు కాకపోయినా..... కాబోయే అల్లుడుగాబట్టే వూరుకున్నాను. లేకపోతే వూరుకుంటానేమిటి చూస్తూ......!"

"ఎవడేవాడు..... ఆ కాబోయే అల్లుడెవడో! .... ఏమిటి తల్లీ, కూతుళ్ళు యిద్దరూ కలిసి ఏం నాటకం ఆడుతున్నారు!. ....ఇంట్లో మగవాడిని వున్నానని కూడ మరచిపోయి, ఇద్దరూ ఎవరికి వారే పెద్దలయి పోయారా?.......నీ కూతుర్ని పెళ్ళాడుతానని చెప్పాడే వాడు?...... యీ బుద్ధి దానికి పుట్టిందా?" భార్య ధోరణి విపరీతమైన కోపం తెప్పించింది రావుగారికి.

"ఎవరికి పుట్టితే ఏం..... మంచి బుద్ధే పుట్టింది గాని చెడు బుద్ధేంగాదు ..... నిక్షేపంలాటి అల్లుడు రాబోతూంటే, కొంపమునిగినట్లు అలా రాద్ధాంతం చేస్తున్నారేమిటి?"

"నీకేం మతివుందా? పోయిందా? అల్లుడంటావు.....అవబోతాడంటావు, నీ కూతుర్ని చేసుకుంటానని నీతో వచ్చి చెప్పాడా?......"

"చెప్పలేదు యింకా, చెపుతాడు".

"నీ కెలా తెలుసు?... ఏమిటే యీభాగోతం!.."

"అలా అడగండి చెపుతాను!...... ఎందుకు చేసుకోడు మన అమ్మాయిని. మన అమ్మాయికి ఏం లోటు.......చదువుతక్కువా, అందం తక్కువా? మూడు నెలలనించి అమ్మాయి, ఆ అబ్బాయి చక్కగా చిలకా గోరింకల్లా, జంటగా తిరుగుతూ, ఒకళ్ళనొకరు ప్రేమించుకున్నారు......రేపో, మాపో పెళ్ళి కూడ చేసుకుంటారు. కట్నాలు కానుకలు అక్కర లేకుండా దాని పెళ్ళి అదే చేసుకుంటుంది....."

"ఏమిటే నీ కాధైర్యం.....చేసుకుంటాడని దాన్నలా విచ్చలవిడిగా తిరగనిస్తున్నావు......తరువాత చేసుకోనంటే ఏంచేస్తావేం?"

''శుభం పలకరా అంటే......ఏదో అన్నాడు మీలాంటివాడే గాబోలు, అతనలాంటి వాగాకోరు కాడు......అల్లరి చిల్లరవాడుగాదూ.... పెద్ద మనిషి, ఉద్యోగస్థుడు, యిద్దరూ యీ మూడునెలల నించి ఎంతో అన్యోన్యంగా తిరుగుతున్నారు. ఒక రంటే ఒకరికి ఎంతో యిష్టం! యింతదాకా వచ్చాక ఎందుకు చేసుకోడు!''

''అయితే యిదంతా నీ పన్నాగమేనా?..... దానితో చెప్పింది నీవేనా?'' తెల్లబోతూ ఆశ్చర్యంగా చూశారు రావుగారు.

''ఆ......నేనే చెప్పాను......నే వప్పుకుంటేనే అదలా తిరుగుతూంది అతనితో. అమ్మ పెట్టా పెట్టదు అడుక్కుతిననీయదు అంటే ఎలా? పాతి కేళ్ళు మీద పడుతున్నాయి. యింతవరకు మీరు పెళ్లి చేయలేకపోయారు.....దానంతట దానిని వదిలితే అదే తెచ్చుకుంటుంది మొగుడిని!.....మన వంతు రెండు అక్షింతలు చల్లడమే!.....దమ్మిడీకట్నం లేకుండా పని జరిగిపోతుంది......'' ధీమాగా అంది జానకమ్మ.

''హోసి, నీ అసాధ్యంకూలా! ఎంత దానివే!...... మాటమాత్రమైనా నాతో చెప్పకుండా ఇద్దరూ యింత నాటకం ఆడుతారా?''

''ఆ......చెపితే చేసే నిర్వాకం ఏమిటి? అడ్డు పుల్లలు వేయడమేగా! అంక్షల పెట్టడమేగా!'' మూతి తిప్పింది జానకమ్మ.

''అయితే ఎప్పుడో యిద్దరూ పెళ్లాడుతారని.... ముందే యిద్దరూ యిలా తిరుగుతూంటే లోకం ఏమనుకుంటుందే:......''

''ఆ.....లోకం!....మరేం పనిపాటులేని లోకం అను కోడానికేం! మన తిప్పలు మనం పడతాము..... అవన్నీ లెక్కచేస్తూ కూర్చుంటే ఎలా?.....మీరు ఐదేళ్ళుగా సాధించలేని పని అది ఐదు నెలలో సాధించు కొస్తుంది........ఇంకో నెలలో రాజాలాంటి అల్లుడు వస్తాడూ చూస్తూండండి.......'' ముసి ముసి నవ్వులు నవ్వింది జానకమ్మ.

''అయితే......యీ తెలివితేటలు..... యీ బుద్ధి నీకెలా పుట్టింది? యింత బుర్ర యీ ఆలోచనా నీదేనా!......''

''పూర్తిగా నాది కాదనుకోండి.....ఆమధ్య ఏదో పత్రికలో ఒక కథ చదివాను......యిలాగే కట్నాలు కానుకలు యీయలేక ఆడపిల్ల పెళ్లి చేయలేక పోతాడు అతండ్రి.....ఆ అమ్మాయి కాస్త బాగా చదువుకున్న అమ్మాయి......యింక యీ తల్లి దండ్రులవల్ల అయ్యేపనికాదని......తనే ధైర్యం చేసి ఒక అబ్బాయిని ప్రేమించి దమ్మిడీ ఖర్చు లేకుండా రిజిష్టరు మేరేజి చేసేసుకుంటుంది! మన అమ్మాయికి రిజిష్టరు మేరేజివద్దు.....మనమే లక్షణంగా పెళ్లి చేసేద్దాం. ఆమాత్రం పెళ్లి చేయ లేకపోం, కట్నాలు యీయలేకపోయినా!......'' కూతురు పెళ్లి నిశ్చయం అయినట్లే మాట్లాడ సాగింది జానకమ్మ.

''నీ తెలివి తెల్లారినట్లే వుంది.....యిదంతా కథలు చదివిన ప్రయోజకత్వమా!.....బాగా వుంది.....కథల్లోలా జరుగుతే...రోజుకి ఎంతమందో పెళ్లిళ్ళు చేసేసుకుని వుండేవారు యీపాటికి...... యింతాచేసి ఆ అబ్బాయి కుటుంబం, మంచి చెడ్డా ఏమైనా విచారించావా లేదా?.....''

''కోసే!...ఆ యీ సంగతి మీరు చెప్పాలా?..... వాళ్ల ఇంటి ప్రక్కవాళ్ల ద్వారా అన్ని సంగతులు రాబట్టే.... ముందడుగువేశాను......''

''అయితే యింతకీ నిర్మలకి, అతనికి పరిచయం ఎలా అయిందే!......'' కుతూహలం అవుకోలేక అడిగారు రావుగారు.

''పరిచయం ఏమిటండీ... ..ఆ వయసులో వాళ్లకి ఒకరినొకరు ప్రేమించుకోడానికి పరిచయం ఉండాలేమిటి? ఆ అబ్బాయి రెండు మూడు సార్లు ......మన నిర్మలవైపు చూడడం గమనిం చాను నేను........మన నిర్మల కూడ అత వా యింట్లోకి వచ్చిందగ్గిరనించి వీధిలో తారట్లా డడం,.... ఆ కిటికీముందు కూర్చోవడం...ఇద్దరూ వాలుచూపులు చూసుకోవడం అన్నీ కనిపెట్టాను..''

''కనిపెట్టి గాలం వేశావన్నమాట!''

''మరేమిటనుకున్నారు!....మొదట్లో అమ్మాయి ఏవో పుస్తకాలు తెప్పించుకునేది పనిమనిషిద్వారా!... తరువాత ఇద్దరూ ఒకరి నొకరు చూసుకుని నవ్వు కోవడం కళ్లతో మాట్లాడుకోవడం అన్నీ గమనించి... పండగనాడు అతనికి పాపం వంటరివాడని పిండి వంటలు పంపించాను వాళ్ల ఇంటి ప్రక్కతనుచేత. .... ఆ అబ్బాయి సంతోషపడి నన్ను చూసి నమస్కారం చేశాడు. తర్వాత దాని పుట్టినరోజున అతనిని మన యింటికి అమ్మాయిచేత టీకి రమ్మని చీటి రాసి పంపించాను. అతను వచ్చాడు. ఇద్దరూ .... ఎంతో చక్కగా మాట్లాడుకున్నారు....యిద్దర్నీ సినిమాకి పంపించాను.....యింక ఏముంది.....అప్పటి నించి యిద్దరూ......ప్రేమించుకున్నారు.... వాళ్లి ద్దరూ తిరుగుతూంటే నేనేం అడ్డుపెట్ట లేదు..... రేపో, మాపో పెళ్లి చేసుకుని మనభారం తగ్గిస్తారు...''

''బాగానేవుంది వరస........యింట్లోవున్న నాతో ఒక్క ముక్క అయినా చెప్పకుండా యింతనాటకం ఆడుతున్నావా?......''

''చెపుదామనుకున్నాను......వాళ్లు నిశ్చయం చేసు కున్నాక చెప్పచ్చని వూరుకున్నాను...''

''ఆ నిశ్చయం ఎప్పుడో జరిగేవరకు.....వూరంద రికి ఏమని సమాధానం చెప్పడమే......నాకేం నచ్చలేదీ వ్యవహారం!''

''అదిగో, మిమ్మల్నిచూస్తే నాకందుకే మంట!.. మీరు పెళ్లి చేయలేరు. చేసుకునేదానిని చేసుకో నీయరు......ఒక్కనెలరోజులు కళ్లుమూసుకు వూరు కుంటే సరి. అన్నీ చక్కబడతాయి. యీలోపల అనేవాళ్లని అననీండి, పట్టించుకోకండి''

''ఏమో!...... మీ తల్లి కూతుళ్లు యిద్దరూ ఏం చేసుకుంటారో చేసుకోండి .... నాకేం తెలి యదు......తరువాత ఏదైనా అయితే మాత్రం వూరుకోను......ఆ......!''

''ఆ...అలా మీరూరుకోండి! .... అంతే చాలు!.......కూతురి పెళ్లి చేసినంత ఫలం......!''

* * *

''ఏమే!...... నీ కూతురి పెళ్లి ఎందాకా వచ్చింది?''...... అప్పుడే నెలరోజులయింది చెప్పి నీవు?........ వీరాలు యింకా ఎక్కువైనాయిల్లే వుంది!.....వూళ్లో తలెత్తుకు తిరగాలా వద్దా నేను. ప్రతివాళ్లు గుసగుసలాడటమే!...... వింతగా చెప్పు కోవడమే!.......నన్ను ప్రశ్నించేయడమేమిటి ఇద్దరూ కలిసి........నీ ప్రవేశం......నీ కూతురు ప్రవాసం యింకొదాలు.....వాళ్లిద్దర్నీ ఆపేసుకుని పెళ్లి చేసుకుని, తర్వాత విడవమను......''

''బాగుందండీ మీవరస!...... చేసుకుంటారు వాళ్ళు, మీకెందుకా తొందర!...... పెళ్ళంటే నిమిషాలమీద నిశ్చయించుకుంటారా?.... ఇద్దరూ బాగా సన్నిహితు లవ్వాలా?........ వాళ్ల స్నేహం బలపడాలా?...... లేకపోతే ముందురోజే పెళ్లిమాటలు ఆడేసుకుంటారా?...... వాళ్ల వాళ్లని అడగడం, మంచి చెడ్డా చూసుకోవద్దా అతను మాత్రం......''

''అసలు...... యింతకీ...... పెళ్లి చేసుకుంటా నని ఖచ్చితంగా చెప్పినట్లేనా!''

''చెప్పలేదు యింకా...... ఏదీ అమ్మాయిని నెమ్మదిగా అడగమని చెప్పాను నిన్ననే, చేసుకుంటా డండీ,....... అమ్మాయంటే ఎంత ప్రేమ తెలుసా! అమ్మాయి పుట్టినరోజున చక్కని పుస్తకం ప్రజంట్ చేశాడు. మొన్న పండక్కి అరవైరూపాయల చీర బహుమతి యిచ్చాడు. యిదంతా ఇష్టంలేక పోతే ఎందుకు చేస్తాడు...!''

''ఏమో యిదంతా నాకేం నచ్చలేదు, నాకే సంగతి తేల్చి చెప్పాలి వారం రోజుల్లో, నీవే అడుగు తావో, నీ కూతురే అడుగుతుందో అదంతా నాకు తెలియదు. నాకు ఏకబురు నిశ్చయంగా వారం రోజుల్లో చెప్పండి. యీ వ్యవహారం పూరా కుంటూంటే చాల దూరమే వెళుతూంది.... ఏదో పీకల మీదకి తెచ్చేట్టున్నారు యిద్దరూ కలిసి.

''ఏమిటండీ...... మీ అనుమానాలు మీరూను..... అన్నింటికి తొందరే....... రేపే అడగమంటాను దాన్ని..........''

''ఏదో విడవండి...... తొందరగా మాత్రం యీ సంగతేదో తేలాలి!''

* * *

''ఏమండీ.... ... మీరొకసారి ఆ గోపాలరావుతో మాట్లాడిరావాలి!''

''ఏ గోపాలరావు?''

''అదే.... అతనే........ మన నిర్మల స్నేహి తుడు గోపాల్‌తో మాట్లాడండి వెళ్లి!''

''నేనా?........ నేనెందుకు మాట్లాడ్డం?'' ఆశ్చర్యంగా చూశారు రావుగారు భార్యవైపు.

''బావుంది, ఎందుకేమిటండీ,........ మీకూతురి పెళ్లిసంగతి మీరు కాకపోతే ఎవరు మాట్లాడు తారు?''

''ఏం ఏమయింది?....... నేను మాట్లాడవలసిన అవసరం ఏమి వచ్చింది? నేను మాట్లాడడం, నేను మంచి చెడ్డా ఏం చూడక్కర లేదుగా!....... అన్నీ నీ కూతురే నిశ్చయించుకుంటుందేమో!''

''బాగుంది అలా అంటే ఎలాగండీ.......!''

''ఏమిటే బాగుండక పోవడం, నీవు, నీకూతురూ కలసి రాజాలాంటి అల్లుణ్ణి తెస్తారేమో, ఏమ యింది?..... ఏం చేసుకోను పొమ్మన్నాడా ఏమిటి?''

''ఏమిటండీ ఆ అపశకునం మాటలూ మీరూను, ఎందుకు చేసుకోనంటాడు .....''

''మరలాంటప్పుడు అడగడ మెందుకు!...... నిర్మల అడిగిందా? ఏమన్నాడు?''

''ఆ........ నిన్ననే అడిగిందట...... ఇవాళరేపు రెండు మూడుసార్లు చూచాయగా అడిగితే 'చూద్దాం చూద్దాం.......' చేసుకుందాం తొందరేం' అని వాయిదాలు వేస్తున్నాడట....... నిన్నను అడిగితే..... 'చేసుకో

నమ్మలో...... అని పినంగతి సరిగా చెప్పకుండా దాటేశాడట........"

"అయింది...... నేననుకున్నంతా అయింది..... వినితే విన్నావు కాటే........ చేసుకుంటాడని దాన్నలా విచ్చలవిడిగా తిరగనిచ్చావు, మహా తెలివితేటలు నీకే వున్నట్టు. అతనికి కూతురిని చూపించి వలలో వేసుకుందామనుకున్నావు...... నీపాటి తెలివితేటలు అవతలి వారికి లేవనుకున్నావు,....... ఏం యిప్పుడు ఏం చేస్తావు? వాడు చేసుకోనంటే!..... చేసుకోను పొమ్మంటే నీవు, నీ కూతురు ఏం చేస్తారే....."

"అబ్బబ్బ...... వుండండి...... అప్పుడే ఏదో కొంప మునిగి పోయినట్టు అలా అరుస్తారెందుకు!"

"ఇంకా ఏంకొంప మునగాలని నీ ఉద్దేశం...... యిది చాలదే........ యిప్పుడు దాన్ని అతను చేసుకోనంటే దాని గతేమిటే,...... యింక యీ జన్మలో దాన్ని ఎవరైనా పెళ్ళాడుతారా?........"

"కాస్త చెప్పిన మాట వినకుండా ఎందుకండీ అలా రాద్ధాంతం చేస్తారు! అతనేం యింకా చేసుకోనని చెప్పలేదు, చేసుకుంటానని చెప్పలేదు........ అది చిన్నదీ, మంచి చెడ్డా ఎలా అడగాలో దానికేం తెలుస్తుంది........ పెద్దవాళ్లం మనం వుండగా అదేం మాట్లాడుతుంది?....... కాస్త మీరెళ్ళి అతనితో మాట్లాడి......... అసలు అతని అభిప్రాయం ఏమిటో తెలుసుకురండి........ వాళ్ల వాళ్లకి రాయమంటాడో ఏమిటో అడిగిరండి......."

"ఏం యిప్పుడు నా సహాయం కావల్సి వచ్చిందా? ముందు నన్నడిగే చేసారా మీరిద్దరూ, యీరోజు నేనడిగి రావడానికి. వెళ్లు..... నీవే వెళ్ళి ఏం మాట్లాడుతావో మాట్లాడి..... కూతురి పెళ్లి చెయ్యి ...... నేవెళ్లను ...."

వల

"అలా అంటే ఎలాగండీ, .. మగవారు మీరు వుండగా నేనెలా మాట్లాడుతాను! ఏం బాగుంటుంది! అలా కోపం తెచ్చుకుంటే ఎలా?...... మన పిల్ల మంచిచెడ్డలు మనం చూడకపోతే ఎలా?"

"ఆహా..... హా....... ఏం చక్కగా చెప్తున్నావు? ఇదివరకు ధీమాగా చెప్పిన కబుర్లు అన్నీ ఏమయి పోయాయి! .... నేనూరుకుంటే చాలు.... పెళ్లయి పోతుందన్నావు!....... వూరికే అన్నారా 'ఆడపెత్తనం మంగలి వైద్యం'అని..... చేసావు నిర్వాకం........"

"చాల్లెండి ఏందెప్పుతారు గాని....... వెళ్లి మాట్లాడిరండీ,.... బహుశా పెద్దవారు మీరేం అడగలేదనే అతనలా అనివుంటాడు......"

"యిది పెద్దవాళ్ళు చేసే పెళ్లి కాదుగా?...."

"బాబూ మీకోనమస్కారం....... ఏదో పొరపాటయింది...... తెంపలేసుకుంటాను, వెళ్లి అడిగి రండి"......... గర్వంగా తలెత్తి చూశారు రావుగారు.

* * *

"ఏమండీ...... ఏమన్నాడండీ అతను?" వాడిపోయిన మొహంతో వచ్చిన భర్తని ఆదుర్దాగా అడిగింది జానకమ్మ. భార్యవంక ఉరిమి చూశారు రావుగారు.

"ఏమవుతుంది పిండాకూడ్దం!...... నే ముందే చెప్పాను..... నాకు తెలుసు యీ వ్యవహారం అంతా! పెద్ద తెలివితేటలు నీకేవున్నాయని...... అబ్బాయిని వలలో వేసుకుని..... దమ్మిడీ కట్నంలేకుండా పెళ్లి చేసేద్దాం అనుకున్నావు........ అనుకుని వప్పులో కాలేశావు!........ యింక యిప్పుడు ఏంచేస్తావు?.... యీవూర్లో యింక నేను తలెత్తుకు తిరిగే తాహతు పోయింది..... .. దానికి యీ జన్మకి పెళ్లయ్యే గీత తప్పింది. ఏడవండి యిద్దరూ కలిసి....."

తీక్షణంగా చూస్తున్న భర్త చూపులకి భయపడింది కలవరపడుతూ "ఏం జరిగిందండీ అసలు ...... ఏమన్నాడు అతను, చేసుకోనన్నాడా?....."

"ఆ....... లేకపోతే........ఎగిరి గంతేసి నీకూతురు పాటిది యింకెవరూ దొరకరని వెంటనే చేసేసుకుంటాడనుకున్నావా?........ చేసుకోను పొమ్మన్నాడు...... నేనేం పెళ్ళి చేసుకుంటానని మీతో చెప్పానా అని ఎదురు ప్రశ్న వేశాడు........ మీరు పొరపడి అలా అర్థం చేసుకోవడం నాతప్పా అన్నాడు! అసలు మీకు ఆ అభిప్రాయం ఎలా కలిగింది..... నేనెప్పుడూ అనలేదే! అని ఆశ్చర్యపోయాడు ..."

"అంతేనే..... అలా పెళ్లీడు పిల్లతో, ... వయసొచ్చిన పిల్లతో........ ఎందుకు తిరిగాడు..... ఎందుకు దానికి ప్రజెంట్సు అవి పంపాడు......" కోపంతో జానకమ్మ మాటలు తడబడ్డాయి.

"అడిగా అదీ అడిగా! నేనేం మీ అమ్మాయిని నాతో తిరగమని కోరలేదు... ...నాతో స్నేహం చెయ్యమని అంతకంటే అడగలేదు..... ఆ అమ్మాయంతట ఆ అమ్మాయే నాతో మాటలు ఆరంభించి పరిచయం చేసుకుంది...... నన్ను ఆకర్షించడానికి ప్రయత్నించింది....... కోరి ఆ అమ్మాయంతట ఆమె వస్తానంటే నాకేం పోయిందని తిరిగాను .. మగవాడిని, ఆమెకి లేని అభ్యంతరం నాకేంవుంటుంది!...... స్నేహంగా వున్నామని ఏవో సందర్భంలో చిన్న ప్రజంట్సు యిచ్చాను. కలసి తిరిగినంత మాత్రాన పెళ్ళాడాలని ఎక్కడైనా వుందా?......... ఆమెని అలా స్వేచ్ఛగా వదలడం మీతప్పా? లేక నేను నిర్మలతో తిరగడం తప్పంటారా, మీకులేని అభ్యంతరం నాకెందుకుండాలి" అన్నాడు. అనవలసినదంతా ధీమాగా మొహం మీదే అన్నాడు......."

"అంటూంటే మీరెలా వూరుకున్నారండీ...... మొహం వాచ్చేక...... పెద్దమనిషి, ఉద్యోగస్థుడు నాలుగు నెలలు తిరిగి యిప్పుడు లేదంటాడా? ... మొహం పగలగొట్టి ముందూ యీడ్చకుండా మీరెలా వూరుకున్నారు. అసలు మిమ్మల్నవాలి, గట్టిగా నాలుగూ అడక్కుండా వూరు..."

"నోర్మూయ్!......" కోపంతో హుంకరించారు రావుగారు........ "అట్టే పేలకు..... చేసిన నిర్వాకం చాలక....... పైగా నామీద ఎడుతున్నావా...... నాతో చెప్పకుండా చెయ్యకుండా,...... ఇద్దరూ కలిసి తెలివితేటలనుకుని వెధవపని చేసి, యింకా నోరు మూసుకు వూరుకోక నన్నంటావా?.......ముందు నా సలహా అడిగి చేసావా?....... అసలు నాతో చెపితే యింతదూరం వచ్చేదా వ్యవహారం!...... అడగలేదట! ఏం అడుగుతాము?.... ఏ మొహం పెట్టుకు అడుగుతాము....... అతనన్న దానిలో ఏం తప్పువుందని అడుగుతాను...... తప్పు మనలో వుంచుకుని పైగా అతన్నేం అనమంటావు? నీ కూతుర్ని అతనితో తిరగడానికి పంపించమని అతనొచ్చి నిన్నడిగాడా? ... నీ కూతుర్ని పెళ్ళాడుతానని నీకేం మాట యిచ్చి మోసం చేశాడా? ఏమని అడగమన్నావు? ....



చేసిన పనికి నోరు మూసుకుని వుండకుండా యింకా పేలుతున్నావు?......'' ఆవేశంగా అంటున్న భర్త వంక తప్పుచేసిన దానిలా చూసి తలదించుకుంది..

''అదేదీ .... ఆ నిర్మల ఏది?...... పుత్ర షికార్లతోనే సరి పుచ్చిందా? లేక యింకా పైకి వెళ్లిందా యిద్దరి స్నేహం...... అతనికేం మగ వాడు,...... ఏదన్నా జరిగితే...... దీని గతేమిటి?..... మనం ఎలా మొహం ఎత్తుకు తిరుగుతాం..... యిప్ప టికే నలుగురి నోళ్లలో పడ్డాం,....... ఏదో పుత్ర స్నేహం అయితే పరవాలేదు........ దాన్నడుగు అసలు ఏంజరిగిందో వాళ్ల మధ్య........ కనుక్కొ- ఏడు!'' విసుగంతా మొహం మీదే చూపించారు రావుగారు.

''ఇకనేనా జాగ్రత్తగా వుండి ఏడవండి........ అతి తెలివితేటలకిపోక........ జరిగింది చాలు........ యిక మళ్లీ అది గడపదాటి బైటకి వెళ్లినట్లు తెలిసిందో ముందు నీపని పడతా జాగ్రత్త!.....ఆ..!''

* * *

''ఏమండీ ... . ఏమండీ........'' దాదాపు ఏడుపు గొంతులో అన్న జానకమ్మ వంక చూశారు రావుగారు.

''ఏమండీ.......'' వణికే గొంతుతో అంటున్న భార్యవంక చిరాగ్గా చూశాడు. ''ఏం కొంప మునిగిందని అలా ఏడుపుమొహం పెట్టావు!''

''కొంపే మునిగిందండీ!........''

''ఏమిటే అది!''

''ఏం చెప్పమంటారు?..... ఖర్మ!..... నిర్మల కొంప ముంచిందండీ!.......''

''ఆ!.......''

''అవునండీ...... పదిహేను రోజులనించి దాని వరస నాకు అనుమానంగానే వుంది..... యివాళతో అనుమానం తీరిపోయింది........ కొంప ముంచిం దండీ!..... యింత పని చేస్తుందనుకోలేదు....... యిప్పుడెలాగండీ,...... నాకు కాళ్లు చేతులు ఆడ్డం లేదు........!...... ఎలాగండీ.......''

''ఎలాగండీ!....... సిగ్గులేకుండా యింకా అడుగు తున్నావు?..... యీ సలహా దాన్ని పూరిమీద వదిలే ముందు అడిగేవు టే....... అంతా అయిపోయాక నా సలహా కావల్సి వచ్చిందా?.....''

''అసలే ఏడుస్తూంటే యింకా ఎందుకంటీ మీ దెప్పుళ్లు....... మన దెబ్బలాటకేంగాని......... ముందు దారి చూడండి...అది ఒకటే ఏడు స్తూంది ... ఏం అడిగినా చెప్పదు..... ఏదో మామూ లుగా సినిమాలకి షికార్లకి తిరగమన్నాను కాని, యిలా వళ్లుపై తెలియకుండా పీకలమీదకి తెచ్చుకో మనలేదు........ జాగ్రత్తగా వుండమని మరీ మరీ చెప్పాను.......''

''చాల్లే..... యింకా సమర్థించుకొంటున్నావు. చేసిన తప్పు ఒప్పుకోకుండా, జాగ్రత్తగా వుండమని చెప్పి పంపిందట ..... వయసులో వున్న యిద్దర్నీ స్వేచ్ఛగా తిరిగిరమ్మనిపంపి....... జాగ్రత్తగా వుండ మని చెప్పిందిట!......'' కళ్లు కొరికారు రావు గారు.

''ముందు ఏదో చెయ్యండి..... తరువాత నిదా నంగా మనం దెబ్బలాడుకుందాం..... ముందు ఆ గోపాల్ దగ్గరకి వెళ్లి చేతులు [illegible] కాళ్లు బ్రతిమిలాడండి...... [illegible] వప్పించి రండి.....అంతగా అత[illegible] ఒప్పుకోకపోతే... ఏ డాక్టరుకో చూపించి ఏదో [illegible] ండండి... నలుగురికి తెలిసి మన పరువు బయట [illegible] ఏదన్నా చెయ్యండి! .....''

''హు ..... యింకా మనకు పరువకటి మిగిలిం దేమిటి? ఏనాడో పోయింది.... యిప్పుడింక ఆ మిగి లింది కూడ పూర్తిగా పోతుంది!..... ఖర్మ!....... ఏ మొహంపెట్టుకు అడగను మళ్లీ వెళ్లి....... వాడి కాళ్లు పట్టుకు బ్రతిమిలాడే ఖర్మ తెచ్చారు తల్లీ కూతుళ్లిద్దరూ కలిసి....''

''అలా అంటే ఎలా చెప్పండి.......''

''నీ కూతుర్ని పంపించకూడదే!..... అది వెళితే దాని పరిస్థితి చూసి జాలిపడైనా ఒప్పుకుంటా డేమో!........''

''మీకంటె ముందేచేసా ఆపని!....... నిన్న పంపించాను...... దీని మొహంచూసి అతను కరగక పోగా... ఎంతో తృణీకారంగా మాట్లాడట... ''

''అయింది, అయితే నే వెళ్లిమాత్రం ఏమి చెయ్యను!.......''

''మీకు చెప్పేసరికి.......'' జానకమ్మ మాటలు నోట్లోనేవుండిపోయాయి, గేటు తెరచుకుని వస్తున్న గోపాలరావు బంట్రోతుని చూసి........

''బాబుగారు మీకీఉత్తరం యీయమన్నా రండీ!'' బంట్రోతు ఉత్తరం అందించాడు.

''ఇంకా ఏం ఉత్తరాలు మిగిలాయి బాబూ..... కొంప ముంచింది యింకా చాలలేదనా..... యింకా ఉత్తరాలు పత్తరాలు......'' రుస రుసలాడుతూ [illegible]గ్రంగా అంది జానకమ్మ. తన పని అయి [illegible]యిందన్నట్లు వెళ్లిపోయాడు బంట్రోతు.

''ఏమిటండీ ఆ ఉత్తరం, మీకా?..... నిర్మలకా? ఏం రాశాడు మహానుభావుడు.......''

''ఏమో, చదవని!''.......

''శ్రీ రావుగారికి,

ఉత్తరం ఏమని మొదలుపెట్టాలో తెలియడం లేదు. ఈ జరిగిన నాటకంలో మీపాత్ర ఏమిటో నాకు తెలియందే, మీకేమని ఉత్తరం రాయాలో అంతు బట్టడం లేదు...... యీ జరిగిన దానిలో మీప్రమేయం బహుశా వుండి వుండదని వూహి స్తున్నాను.........

ఈ కాలంలో ఆడపిల్లల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు ఒక సమస్యగా తయారయ్యాయని నాకు తెలుసు!..... చదువు, కాస్త, కూస్త అందం వున్నా కట్నాలు గుమ్మరించే శక్తిలేక..... ఎందరో కన్యలుగా చాలా కాలం వుండిపోయి తల్లిదండ్రుల గుండెలమీద కుంపటిగా తయారవుతున్నారని ఎరుగుదును! యీ సమస్యని కొత్త మలుపుగా పరిష్కరించడానికి యీ మధ్య ఒక క్రొత్త పుంత త్రొక్కినట్లు వింటు న్నాను...... కాస్త చదువుకున్న యువతులు తమంత టు తామే ముందడుగువేసి వరాన్వేషణ సాగించి... వచ్చిన వారిని ఎన్నుకుని వారిని ఆకర్షించి ప్రేమా

ఆరోగ్య అనారోగ్య
పరిస్థితులలో మహిళలు
ఆరోగ్య
సౌభాగ్యములకు
ఆధారపడునది
లోధ్ర
66 సంవత్సరముల పైగా
ప్రసిద్ధి నొందినది

కేసరి కుటీరం
(ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14
ఏజెంట్లు:
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)
విజయవాడ - సికిందరాబాదు - మధుర -
బరహంపురం - బెంగుళూరు

పుస్తకములు

5 పుస్తకముల సెట్టు రు. 5-50.
(1) కొక్కోకశాస్త్రం (2) సుహాగ్ రాత్ (3) మంటన పద్ధతులు, (4) 84 ఆసనములు, (5) రహస్యఫోటో ఆల్బం. ఒక్కొక్క పుస్తకం రు. 2/-. పోస్టేజి, ప్యాకింగ్ అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.

SULEKHA TRADERS.
WAT-7) .Beat No. 13, Aligarh

3 నెలలు ఉచిత బహుమతి

అందమైన స్త్రీలకు మిక్కిలి నూతనమైన ఆకర్షణీయమైన డిజైనులలో రంగులలో సరిక్రొత్త కాశ్మీర్ ఆర్ట్ చీరెలు వచ్చియున్నవి పెద్ద సైజులలో మాత్రమే లభించును. 1 డీలక్స్ చీర రు. 11లు; 2 రు. 20లు; 3 కి రు. 28లు; 4 కి రు. 36/- రెండు లేక అంతకు మించి చీరెలకు ఆర్డరు పంపిన వారికి బ్లౌజు గుడ్డ ఉచితం
మీ ఆర్డరును పోస్టు కార్డు ద్వారా పంపెదము.

ARVIND AGENCIES (WAPT-22)
P. B. 1408, Delhi-6.

వల

నాలు జరిపి, ఆ ప్రేమాయణం సర్వసాధారణం పెళ్ళిగా మారుస్తున్నారు. కట్నాలు కానుకలు అక్కర లేకుండా వరాన్వేషణలో కృతకృత్యులవుతున్నారని తెలుస్తోంది. సహోద్యోగులనో, లేక కాస్త ముఖ పరిచయమున్న ఇరుగుపొరుగు యువకులతో, కాస్త పరిచయమున్న వారితో యీ పద్ధతి అవలంబించి విజయులవుతున్నట్లు వింటున్నాం...... యిలాంటి కథలు కూడ చదివినట్లు గుర్తు.... దీనికి తల్లిదండ్రుల ముఖ్యంగా తల్లుల మద్దతు కూడ వుంటుంది. పిల్లల్ని నీవల్ గా వదిలి అల్లాం. అని ఆకర్షిస్తే..... ఆ గాలంలో ఎవరో ఒకరైనా చిక్కకపోరని...... తరువాత తమ పని తేలిక అవుతుందని గుర్తించారు....... ప్రేమ పెళ్ళికి కట్నాలు అక్కరలేదని యీ పద్ధతి అవలంబిస్తున్నట్లు తెలుస్తోంది.........

అంటే కట్నాలని నేను ఆమోదిస్తున్నానని కాదు!..... అలా అని ఆడపిల్లల తల్లిదండ్రులపట్ల నాకు సానుభూతి లేదనీ గాదు!...... కాని యీ అవలంబించిన పద్ధతి సరిఅయినది కాదని...... దీనివల్ల చాల ముప్పులు రావచ్చని నా వ్యక్తిగతాభిప్రాయం!........

నేనూ యిలాంటి వలలో చిక్కుకున్నట్లు నిర్మలతో స్నేహం ఆరంభించిన మొదట్లో కనిపెట్టలేకపోయాను.... నిర్మల చదువుకున్నా కాస్త అమాయకురాలు. మాటల సందర్భంలో "యిలా నాతో తిరిగితే మీవాళ్ళు కేకలు వేయరా' అని రెండు మూడుసార్లు అడిగితే, 'ఏమనరని, వాళ్ళమ్మగారు వప్పుకుంటేనే తను నాతో తిరుగుతున్నట్లు' చెప్పింది..... అప్పుడు గాని నేనూ...... యీ స్త్రీ వేసిన గాలానికి తగులుకున్నానని స్ఫురించింది..... నిజంగా నేను నిర్మల అందానికి ఆకర్షితుడనై ఆమెతో స్నేహం చేసుకున్నా...... నిర్మల,...... మీరు యింత గడుసుగా వ్యవహరించి, నన్ను అల్లుడుగా చేసుకోవాలనుకోవడం నాకు కాస్త కోపం కలిగించింది.... మీరు నిక్కచ్చిగా మీ అమ్మాయిని చేసుకోమని వచ్చి అడిగితే నిరభ్యంతరంగా సంతోషంగా ఆమోదించే వాడినేమో!..... దానికోసం..... యిలా డొంక తిరుగుడుగా వ్యవహరించడం..... నన్నిలా మోసంచేసి గెలవాలనుకోవడంతో నాకు పౌరుషం వచ్చింది. అంతేకాక వయసులోవున్న ఆడపిల్లని వంటరిగా ప్రలోభంకోసం పరాయి మగవాడిని నమ్మి స్వేచ్ఛగా వదిలిన మీమీద నాకు కాస్త తక్కువ అభిప్రాయమే ఏర్పడింది........

కథల్లో మాదిరి..... నిజంలోనూ యిలా వ్యవహరిస్తారని స్వానుభవం వల్లనే తెలిసింది. ఆ కథల్లో మాదిరి నేనూ యీ వలలో గుడ్డిగా పడిపోకూడదని నిశ్చయించి నా జాగ్రత్తలో నేనున్నాను...... నిర్మలతో నేను ఎంత సన్నిహితంగా మెలగినా, నిర్మల నన్ను ఎన్నిసార్లు పెళ్ళిమాట అడిగినా..... పొరపాటున కూడా నేనెప్పుడూ పెళ్ళి చేసుకుంటానని మాటీయలేదు! నేను నిర్మలకి ఎలాంటి భరోసా ఆశాయకపోయినా...... మోసమో, ప్రేమో..... తెలివి తక్కువో తెలియదు కాని........ నిర్మల నన్ను పూర్తిగా నమ్మి..... పాపం అయిన ఆమె అమాయకత నాకు జాలి కలిగించింది.

మోసం చేయాలన్న ఉద్దేశం నాకు కలలో కూడా లేదు గనుక నిర్మలతో నేను అంత సన్నిహితుడనయ్యాను...... కేవలం మీకు పాఠం నేర్పడం కోసమే......నిర్మలతో నాకిష్టం లేకపోయినా అతిగా సంచరించాను....... మీరు, నిర్మల స్వయంగా పెళ్ళి విషయం అడిగినా...... నిరుత్సాహంగా నిరాకరించడం కూడ కేవలం మీకు యిలాంటి పనుల వల్ల ఎంత అనర్థం జరుగుతుందో తెలియపరచడానికే! యింత దాకా వచ్చాక..... యిప్పుడు నేను నిర్మలను పెళ్ళాడనంటే మీరు చేయగలిగింది ఏమి లేదు!....... ఎవరూ కూడ నాది తప్పని అనలేరు! యీడువచ్చిన పిల్లని యధేచ్ఛగా వదిలిన మిమ్మల్నే దుయ్యబడతారు......ఇప్పుడు నేను నిర్మలని కాదంటే ఆమె గతి ఏమిటి? ఆమె జీవితం ఏమవుతుంది?..... ఇవన్నీ మీరు ఆలోచించారా?...... యిలాంటి మోసకారులు, మోసాలు, వంచనలు జరగడం అబద్ధం ఎంత మాత్రం కాదు!........ అంటే నేనొక్కడినే మంచివాడిని, నీతిపరుడిని అనలేను......... కాని..... అలా మీరు మోసపోయే అవకాశాలు చాలవున్నాయి, అలా మోసపోతే........ మీరు చేయగలిగిందీ ఏమీ లేదు సుమా అని చెప్పడానికే....... నేను మీకు పాఠం నేర్పడానికే యింతదూరం వెళ్ళాను. మీ కోరికని నిరాకరించడానికీ అదే కారణం!.....

యింకా యింకా మిమ్మల్ని బాధించడానికి నా మనసు వప్పలేదు. ముఖ్యంగా నిన్న నిర్మల స్థితి చూశాక..... యింకా యింకా తెగేవరకు తాడు లాగకూడదని పించింది...... నేను ప్రాణంగా ప్రేమించిన నిర్మల ఏడ్చినా తొందరపడితే...... నన్ను నేను ఎప్పటికీ క్షమించుకోలేనని పించింది.

యిలా అమ్మాయిలని 'ఎర'గా చూపించి అబ్బాయిలని వలలో వేసుకుని, అల్లుళ్ళుగా చేసుకుందామనే వారందరికీ కూడ దానివల్ల జరగబోయే అనర్థాలని కూడ గుర్తించుకుని..... మరీ అలాంటి వలలు పన్నడం మంచిది అని చెప్పడమే నా ఉద్దేశం.

వీలయినంత త్వరలో ముహూర్తం పెట్టించండి...... మావాళ్ల అనుమతి కూడ తీసుకున్నాను. యీ స్థితిలో నిర్మలని యింకా అలా అన్నేసి రోజులు వుంచి లోకుల దృష్టిలో హీనమవడం మంచిది గాదు.

యిన్నాళ్ళు నిర్మలని, మిమ్మల్ని బాధించినందుకు క్షంతవ్యుడిని!'

ఉత్తరం చదివిన రావుగారు తృప్తిగా నిట్టూర్పు విడిస్తే...ఆనందపు సిటపొరలు కళకళలాడగా... నిర్మల వైపు చూసి...నవ్వేసుకుంది, తృప్తిగా జానకమ్మ. ●